TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 233 | శనివారం 15-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

## విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

## స్వాతంత్ర్య దినోత్సవం ముందురోజు..

ఢిల్లీలో పలు ప్రాంతాలకు బాంబు బెదిరింపులు



2లో

## ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిన దేశ విభజన: ప్రధాని మోదీ

- దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది
- బాధితుల ధైర్యాన్ని కొనియాడిన ప్రధాని మోదీ
- చెల్లాచెదురైన కుటుంబాలు.. తీరని విషాదం
- బాధలను అధిగమించి జీవితాలను పునర్నిర్మించుకున్నారు
- దేశ ప్రగతికి బాధితుల సేవలు స్ఫూర్తిదాయకం
- సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకుందాం
- వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దాం



దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ (గ్రావీ వీశీఎఱ) అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది.

పేజీ 2లో ▶

## తప్పు చేశా..

ఎవరూ ఆ రూట్‌లో అమెరికాకు వెళ్లొద్దు!



2లో

## విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ ఇస్తున్నాం

హైదరాబాద్: ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా ఫులే విధానాలను కొనసాగిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుతో తలరాత మారి.. సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిబా ఫులే, సావిత్రిబాయి ఫులే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విద్యార్థులు, యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామని చెప్పారు. "ఏటా రూ. 2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుంది.

- విద్యతో పాటు సాంకేతిక నైపుణ్య శిక్షణ: సీఎం రేవంత్
- నాణ్యమైన విద్యతో యువతకు మెరుగైన భవిష్యత్తు
- యంగ్ ఇండియా స్కూళ్లతో విప్లవాత్మక మార్పులు
- ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఏఐ సవాళ్లను ఎదుర్కొనేలా నైపుణ్య శిక్షణ
- జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలో ఉద్యోగ అవకాశాలు
- నైపుణ్యం సాధించిన యువతను విదేశాలకు పంపిస్తాం
- ఒలింపిక్స్ పతక విజేతలకు ఉద్యోగాలు, నజరానాలు

## సీఎం రేవంత్



## హైదరాబాద్-శ్రీశైలం హైవేపై ప్రమాదం: ఒకరి మృతి




రంగారెడ్డి: హైదరాబాద్-శ్రీశైలం హైవేపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ వద్ద హైవేపై ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి కిందపడిన శివయాదవ్‌ను వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో తాండ్రకు చెందిన శివయాదవ్ అక్కడిక్కడే మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు




## సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ..

### కీలక అంశాలపై చర్చ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో తెలంగాణ మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది. రాష్ట్రంలో 22-ఏ నిషేధిత భూములు, మెట్రో రైలు వంటి కీలక అంశాలపై కేబినెట్ చర్చిస్తోంది. సంక్షేమ పథకాల విస్తరణ, కొత్త లబ్ధిదారుల ఎంపికపై కూడా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొత్త ల్యాండ్ పూలింగ్ విధానం, చేయూత పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, హెల్త్ పాలసీ, ఆహారకల్తీ వంటి అంశాలపై మంత్రివర్గం సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

పేజి 2లో ▶





# సెప్టెంబర్1 న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

- బిజెపి కి హటావో -దేశ్ కి బచావో
- ధరల పెరుగుదలను అరికట్టాలి కార్మిక హక్కులను సంరక్షించాలి
- ఎగువ మానేరు ప్రాజెక్టును కాపాడుకుందాం
- సిపిఐ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్

ముస్తాబాద్/ ఆగస్టు 14 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిపిఐ కామ్రేడ్ గుంటి వేణు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా శుక్రవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మల ఎగువ మానేరు డ్యామ్ సందర్శన కార్యక్రమానికిముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరై ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, ప్రతి ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సంరక్షించాలని సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోనికి తేవాలని అలాగే ఎగువ మానేరు ప్రాజెక్టుకు రూ.500 కోట్లు మంజూరు చేసి పర్యటక కేంద్రంగా తీర్చి దిద్దాలని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టును కాపాడాలని సిపిఐ జాతీయనేత మాజి ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్, గంభీరావుపేట మండలాలకు జీవనాడిగా ఉన్న నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.1946 నుంచి 1951 మధ్య నిర్మాణం పూర్తైన ఈ ప్రాజెక్టు గత 70--75 ఏళ్లలో సరైన సంరక్షణ లేక ఆప్రాన్ సైడ్ వాల్స్ దెబ్బతిందని భారీ వరదలు వచ్చినప్పుడు ప్రాజెక్టు పునాదులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా ఉండేందుకు ఆప్రాన్ శాశ్వత యుద్ధ ప్రాతిపదికగాన మరమ్మతులు చేపట్టాలని కుడి ఎడమ కాలువల షెటర్లు మరియు తూములు తుప్పు పట్టి నీరు వృధాగా పోతుందని కాలువలను శుభ్రపరిచి రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని సంవత్సరాల తరబడి ప్రాజెక్టు లోపల భారీగా మట్టి పేరుకుపోవడం జరిగిందని దీనివల్ల ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం గణనీయక తగ్గిపోయిందని ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రాజెక్టులో పేరుకుపోయిన మట్టిని పూడిక తొలగించాలని గత రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పూడికతీత చేపట్టామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నర్మాల ప్రాజెక్టులో ఇప్పటికీ భారీగా పూడిక పేరుకుపోయిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎగువ మానేరు ప్రాజెక్టుపై కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొందని స్థానిక ప్రజలు, జేఏసీ,ల ఆధ్వర్యంలో 'నర్మాల బచావో' అంటూ ఉద్యమకారులు ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని పేర్కొన్నారు. 2.2 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు, పూడిక పేరుకుపోయిన కారణంగా ప్రస్తుతం కేవలం 1.2 టీఎంసీలకే పరిమితమైందని తెలిపారు. మెట్ట ప్రాంతాలైన ముస్తాబాద్, గంభీరావుపేట మండల రైతులకు ఈ ప్రాజెక్టు సాగునీరు అందించే ఏకైక జీవనాధారం అని ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రాజెక్టులో గేట్లు లేకపోవడం వల్ల నీటి నిల్వసామర్థ్యం మరింత తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సుమారు 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఈ ప్రాజెక్టు, తాగునీరు మరియు సాగునీటి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు.నర్మాల ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే



అవకాశం ఉందని,ఇందుకోసం ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించి సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.ఈ అంశంపై ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తామని, అవసరమైతే ప్రతినిధి బృందంతో కలిసి నేరుగా ముఖ్యమంత్రిని కలుస్తామని తెలిపారు.అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, కొండపోచమ్మ ప్రాజెక్టులతో అనుసంధానం ద్వారా నర్మాల ప్రాజెక్టుకు శాశ్వత నీటి సరఫరా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి జలాలను అనుసంధానం చేయడం ద్వారా దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమని పేర్కొన్నారు.నర్మాల ప్రాజెక్టును కాపాడేందుకు సీపీఐ పార్టీ కంకణం కట్టుకుందని, ప్రభుత్వం నిర్లక్ష్య వహిస్తే ఎగువ మానేరు ప్రాజెక్టు రైతులతో కలిసి ఎగువ మానేరు కాపాడుకోవడానికి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి మానుకోవాలని సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాల నాయకులు కామ్రేడ్ గుంటి వేణు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, డివైఎఫ్ రాష్ట్ర నాయకులు మార్వాడి సుదర్శన్ నాయకులు చాకలి రమేష్, మంగలి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు సిపిఐ ప్రజాచైతన్య యాత్ర

- బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసిన సిపిఐ శ్రేణులు
- వేములవాడలో ఉత్సాహంగా సాగిన యాత్ర




వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 14

సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదారి రాములు ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజాచైతన్య యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగాన్ని, 44 కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు.కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం లేకుండా చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. ఏటా నాలుగు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. దేశ బ్యాంకులు, ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదారి రాములు, పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజు, గ్రామపంచాయతీ జిల్లా కార్యదర్శి దుంద్రపెల్లి రవీందర్, మున్సిపల్ జిల్లా కార్యదర్శి పందుల మల్లేశం, ఆటో యూనియన్ నాయకులు వావిలాల శంకర్, దుర్గయ్య, ఎల్లయ్య, పండుగ చంద్రయ్య, ఎద్దండి బాలయ్య, ఈసరి దేవన్న, పరమేష్, మండేయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో హనుమాన్ తండా రహదారికి తాత్కాలిక ఉపశమనం వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును చదును చేసిన సర్పంచ్ గౌతమి-ప్రశాంత్

- మొరం పోయించి గోతులు పూడ్చివేత.. బాటసారుల కష్టాలకు చెక్ విషజ్వరాల నివారణకు ముందస్తు చర్యలు.. త్వరలో సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి
- గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం: సర్పంచ్ పిలుపు

కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 14

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలోని హనుమాన్ తండాకు వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింది. రోడ్డంతా బురదమయంగా మారడంతో గ్రామస్థులు, విద్యార్థులు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలు దాదాపు కష్టసాధ్యంగా మారాయి.తండావాసుల సమస్యలను గుర్తించిన గ్రామ సర్పంచ్



వంకాయల గౌతమి-ప్రశాంత్ వెంటనే స్పందించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా మొరం తెప్పించి రహదారిపై ఉన్న గోతులను పూడ్చివేసి చదును చేయించారు. దీంతో హనుమాన్ తండాకు వెళ్లే మార్గం మళ్లీ ప్రయాణానికి అనుకూలంగా మారి ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ వంకాయల గౌతమి-ప్రశాంత్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వ్యాప్తి పెరిగి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యగా రహదారి మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు.కొండాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. హనుమాన్ తండా రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, ఆయన సహకారంతో త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని వెల్లడించారు.అలాగే తాగునీటి సరఫరా, పారిశు ధ్యం, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పంచాయతీ పాలకవర్గానికి సహకరించాలని కోరారు.రోడ్డు సమస్యపై వెంటనే స్పందించి పనులు పూర్తి చేయించిన సర్పంచ్ గౌతమి-ప్రశాంత్‌కు హనుమాన్ తండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# వేగవంతంగా సబ్ స్టేషన్ పనులు.. త్వరలోనే విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం!

- హర్షం వ్యక్తం చేస్తున్న లింగంపేట రైతాంగం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

చందుర్తి మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 14



చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులు అత్యంత వేగవంతంగా సాగుతున్నాయి. ప్రజాపాలనలో రైతన్నలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని ?3,52,10,000 నిధులను మంజూరు చేయించడమే కాకుండా, గతేడాది ఏప్రిల్ నెలలో భూమిపూజ చేశారు. ప్రస్తుతం సబ్ స్టేషన్ ప్రాంగణంలో బోరు బావి తవ్వకం పనులు కూడా పూర్తయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సబ్ స్టేషన్ కల నెరవేరుతుండటంతో లింగంపేట గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే తమ ప్రాంతంలో లో-వోల్టేజ్, విద్యుత్ కొరత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దీపావళి నాటికి సబ్ స్టేషన్ నిర్మాణ పనులన్నీ పూర్తిగా పూర్తవుతాయని కాంట్రాక్టర్ వెల్లడించారు. ఏళ్ల నాటి తమ కలను నిజం చేస్తూ, విద్యుత్ సమస్యల నుండి విముక్తి కలిగిస్తున్నందుకు గ్రామ ప్రజలు, రైతాంగం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అమాలి కార్మికులకు హెల్త్ కార్డ్ పెన్షన్ అందించాలని

- తహసిల్దార్ కు వినతిపత్రం అందజేత

ముస్తాబాద్/ ఆగస్టు 14 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లాముస్తాబాద్ మండల కేంద్రంలో అమాలి కార్మికులకు పెన్షన్, హెల్త్ కార్డు అందించాలని కోరుతూ తాసిల్దార్ ఫారుక్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ కార్మికుల ఆశయ సాధనకై శ్రమజీవుల పోరాట యోజనగా సిఐటియు సి డబ్ల్యు ఎఫ్ ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గీస బిక్షపతి యువకులు ముందుండి పోరాడే ఈ సమరభేరానికి అమాలి కార్మికులకు కర్షకులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన మ్యానిఫెస్టోలో అమాలి కార్మికుల వెల్ఫేర్ బోర్డుకు నిర్మాణ కర్త సిఐటియు ఎన్నో పోరాటాలు చేస్తూ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం బోర్డు ఏర్పాటు చేయాలి హెల్త్ కార్డులు ఇవ్వాలి 55 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలీ కార్మికునికి 6000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో అమాలి కార్మికులు పాల్గొన్నవారు ఎడ్ల రమేష్ సిహెచ్ నరసింహులు కట్కూరి నరేష్ ఎడ్ల సంజీవ్ మాడూరి రమేష్ లోకం రాజయ్య తదితరులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది

TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
15-08-2026

# జిల్లాలో తీవ్ర విషాదం.. గంభీరావుపేటలో నిండు గర్భిణి ఉరేసుకుని ఆత్మహత్య

**- కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు**

గంభీరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 14



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో తీవ్ర విచారకరం, కలచివేసే ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని ముస్తఫా నగర్ గ్రామానికి చెందిన బొంతల లావణ్య (27) అనే నిండు గర్భిణి తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు లావణ్య ప్రస్తుతం తొమ్మిదో నెల గర్భంతో ఉంది. మరో కొద్ది రోజుల్లో ప్రసవం జరగాల్సి ఉండగా, అంతలోనే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవడం గ్రామంలో తీవ్ర శోకాన్ని నింపింది. మృతురాలికి ఇప్పటికే నాలుగేళ్ల వయసున్న ఒక కుమారుడు కూడా ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై సమాచారం అందుకున్న గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ తమ సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదని, కుటుంబంలో ఏవైనా కలహాలు ఉన్నాయా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పూర్తి స్థాయి దర్యాప్తు చేపడుతున్నారు. నిండు గర్భిణీతో పాటు కడుపులోని బిడ్డ కూడా ప్రాణాలు కోల్పోవడంతో ముస్తఫా నగర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

# వట్టిమల్ల గొల్లపల్లిలో భూ వివాదం.. వ్యక్తిపై పారతో దాడి, హత్యాయత్నం

**- ఇద్దరు నిందితులను అరెస్ట్, రిమాండ్ కు తరలింపు..**
**- పత్రిక ప్రకటన విడుదల చేసిన చందుర్తి సీఐ కె. రవీందర్**

కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 14




భూ వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై పారతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ కె. రవీందర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన సామల శ్రీనివాస్ (47), అతని వదిన సామల లచ్చవ్వ (50)లకు, అదే గ్రామానికి చెందిన పెద్దగొల్ల సత్తయ్యతో బీరప్ప గుడి వద్ద ఉన్న 8 గుంటల వ్యవసాయ భూమి మరియు దారితొవ్వ విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ విషయమై ఈ నెల 12న గ్రామంలో కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాయతీలో ఇరువర్గాల మధ్య పరిష్కారం లభించలేదు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం శ్రీనివాస్, లచ్చవ్వలు వివాదాస్పద భూమి వద్దకు వెళ్లి, సత్తయ్య పొలంలో హద్దు రాళ్లు పాతారు. అక్కడికి వచ్చిన సత్తయ్య దానిని ప్రశ్నించడంతో గొడవ మొదలైంది. ఈ క్రమంలో సత్తయ్యను అంతమొందిస్తేనే తమ భూసమస్య తీరుతుందని పథకం ప్రకారం శ్రీనివాస్ తన వెంట తెచ్చుకున్న పారతో సత్తయ్య తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తగాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఈ రోజు (ఆగస్టు 14) ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన కోనరావుపేట ఎస్ఐ ఖ. ప్రశాంత్ రెడ్డి, సిబ్బందిని సీఐ రవీందర్ అభినందించారు.

# మద్దిమల్ల తాండ గ్రామంలో గుడుంబా పై పోలీసుల మెరుపు దాడి..

వీర్నపల్లి ఆగస్టు 14 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా వీరన్న పెల్లి మండలం లోని మద్దిమల్ల తండా గ్రామంలో ఎస్సై లక్ష్మణ్ గుడుంబా స్థావరాలు పై మెరుపు దాడి నిర్వహించారు .భూక్య మంజుల భర్త భీమా ఇంటి వద్ద నిషేధిత గుడుంబా తయారు చేస్తుండగా రైడ్ చేయగా ఇంటిలో రెండు లీటర్ల గుడుంబా, గుడుంబా తయారీ సరుకులు దొరికాయి. ఈ సందర్భంగా మంజులపై కేసు నమోదు చేశారని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# “మేము ప్రశ్నిస్తేనే అనుమతులు రద్దు చేస్తారా?”

**- అక్రమ అనుమతులు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**- జగిత్యాల బస్టాండ్ గెజిట్‌పై స్పష్టత ఇవ్వాలి భూ యజమానులకు తక్షణ పరిహారం చెల్లించాలని డిమాండ్**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 14





“మేము ప్రశ్నిస్తేనే నిర్మాణ అనుమతులు రద్దు చేస్తారా? ప్రశ్నించకపోతే అక్రమాలను కొనసాగిస్తారా?” అంటూ వేములవాడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి రాజు మున్సిపల్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల నిషేధిత స్థలంలో మంజూరు చేసిన నిర్మాణ అనుమతులను రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె, కౌన్సిలర్ వెంగల అనిత శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలను తీవ్రంగా ఖండించారు. వేములవాడ పురపాలక సంఘం అవినీతి, అక్రమాలకు కేంద్రబిందువుగా మారిందని ఆరోపించారు. నిషేధిత ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం వెనుక అధికారులు, పాలకవర్గం మధ్య లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. మాజీ ప్రభుత్వం జగిత్యాల బస్టాండ్ నిర్మాణం కోసం 20 ఎకరాల 20 గుంటల భూమిని గెజిట్ చేసి నిషేధిత ప్రాంతంగా ప్రకటించినప్పటికీ, అదే స్థలంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ అనుమతులు జారీ చేశారని ఆరోపించారు. ఈ విషయమై ఆగస్టు 3న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ ఫిర్యాదు ఆధారంగానే ఆగస్టు 12న ఉన్నతాధికారులు ఆ అనుమతులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. అయితే కేవలం అనుమతులు రద్దు చేయడం సరిపోదని, మున్సిపల్ చట్టం-2019 ప్రకారం అక్రమ అనుమతులకు కారణమైన టౌన్ ప్లానింగ్ అధికారులపై సస్పెన్షన్‌తో పాటు కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పు జరిగినట్లు స్పష్టమైనప్పటికీ సంబంధిత అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జగిత్యాల బస్టాండ్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి దాదాపు తొమ్మిదేళ్లు గడిచినా భూ యజమానులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోవాలనుకుంటే భూ యజమానులకు మార్కెట్ విలువ ప్రకారం భారీ స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, లేకపోతే గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేసి భూములపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి భూ యజమానులకు న్యాయం చేయాలని కోరారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీలో ఇలాంటి మరిన్ని అక్రమ అనుమతుల వ్యవహారాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన ఆధారాలను త్వరలోనే ప్రజల ముందుకు తీసుకువస్తామని మాధవి రాజు హెచ్చరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాధితుల పక్షాన భారీ ప్రజా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

# ఖర్గే వేదిక శుద్ధీకరణ ఘటనపై విప్ ఆది శ్రీనివాస్ ఫైర్

**- దళితులను అవమానించే రాజకీయాలు బీజేపీకి తగవు రాజ్యాంగ విలువలను కించపరిచే చర్యలపై తీవ్ర ఆగ్రహం**
**- హల్ద్వానీ ఘటన సామాజిక న్యాయానికి విరుద్ధం.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 14



కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, దళిత సమాజానికి చెందిన ప్రముఖ నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన సభా వేదికను శుద్ధీకరణ పేరుతో హవనం చేయడం దేశ రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించే చర్య అని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీ రాంలీలా మైదానంలో చోటుచేసుకున్న ఈ ఘటన కుల వివక్ష భావజాలానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన “విజయ్ శంఖనాద్” సభలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించగా, రెండు రోజుల అనంతరం అదే వేదిక వద్ద శ్రీరామ్ సేన కార్యకర్తలు శుద్ధీకరణ హవనం నిర్వహించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. ఒక జాతీయ నాయకుడు, దళిత సమాజ ప్రతినిధి మాట్లాడిన వేదికను అపవిత్రంగా భావించడం అత్యంత బాధాకరమని వ్యాఖ్యానించారు. “మల్లికార్జున ఖర్గే మాట్లాడిన ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఇది వ్యక్తిగతంగా ఖర్గేను మాత్రమే కాదు, దళిత సమాజ గౌరవాన్ని కూడా అవమానించే చర్య కాదా?” అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.

### రాజ్యాంగం చెప్పేది సమానత్వం

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన గౌరవం కల్పించిందని, కులం ఆధారంగా వ్యక్తులను తక్కువగా చూడడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాజకీయ భేదాలు సహజమే అయినప్పటికీ, కులం పేరుతో వ్యక్తుల గౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

### సమాజాన్ని విభజించే కుట్రలు

బీజేపీ, దాని అనుబంధ సంస్థలు మతం, కులం పేరుతో ప్రజలను విభజించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. దేశ సమైక్యత, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను ప్రతి ప్రజాస్వామ్యవాది ఖండించాలని పిలుపునిచ్చారు.

### ప్రజా వేదికను అపవిత్రంగా చిత్రీకరించడం సరికాదు

రాంలీలా మైదానం ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉపయోగించే ప్రజా వేదిక అని గుర్తు చేశారు. అలాంటి ప్రదేశంలో ఒక నాయకుడు ప్రసంగించినందుకు అనంతరం శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతుందని అన్నారు.

### కాంగ్రెస్ లక్ష్యం సమానత్వ సమాజం

మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కలలు కన్న సమానత్వ సమాజ నిర్మాణమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆది శ్రీనివాస్ తెలిపారు. మానవత్వం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి విలువలను పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే శక్తులను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# తొలి సాదాబైనామా కేసు ఆమోదం

తంగళ్లపల్లి మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 14



సాదాబైనామా ద్వారా జరిగిన భూ లావాదేవీల క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలోనే తొలి సాదాబైనామా కేసు ని తంగళ్లపల్లి మండలంలోని తంగళ్ళపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఆమోదం పొందడం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని రెవెన్యూ డివిజనల్ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా సిరిసిల్ల ఆర్డీఓ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సాదాబైనామా కేసులను పారదర్శకంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు భూ హక్కుల క్రమబద్ధీకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో తొలి కేసు ఆమోదం పొందడం సంతోషకరమైన పరిణామమని, అర్హత కలిగిన మరిన్ని సాదాబైనామా కేసులు ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు నిబంధనల మేరకు అర్హులైన అన్ని కేసులను ఎటువంటి జాప్యం లేకుండా దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లో బాగంగా లబ్దిదారుడైన ఇటికాల శంకర్ కు తంగళ్ళపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో గల 5 సర్వే నెంబర్ లో గల 0.30 గుంటల భూమి కి సంబందించిన 13(దీ) ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం అందచేయడం జరిగింది. కార్యక్రమశీలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తంగళ్లపల్లి తహసీల్దార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# నీట్ జేఈఈ 2027కు బీసీ విద్యార్థులకు బంగారు అవకాశం

**- ఉచిత లాంగ్ టర్మ్ రెసిడెన్షియల్ కోచింగ్‌కు ఆగస్టు 16 వరకు దరఖాస్తులు**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 14

వైద్య, ఇంజినీరింగ్ రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసించి జాతీయ స్థాయిలో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్న బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) అరుదైన అవకాశాన్ని కల్పిస్తోంది. నీట్-యూజీ, జేఈఈ-2027 ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే అర్హులైన విద్యార్థులకు పూర్తిగా ఉచిత లాంగ్ టర్మ్ రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్లు ప్రకటించింది. జాతీయ స్థాయి వైద్య, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి ఐఐటీలు, ఎన్ఐటీలు, ప్రముఖ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన బీసీ విద్యార్థులు, అలాగే నీట్, జేఈఈ-2026లో మెరుగైన ప్రతిభ కనబరిచిన అభ్యర్థులు ఈ అవకాశానికి అర్హులు.

**మెరిట్ ఆధారంగానే ప్రవేశాలు**

విద్యార్థుల ఎంపికను మెరిట్, అర్హత ప్రమాణాల ఆధారంగా నిర్వహించనున్నారు. దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉంటే స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల విద్యార్థుల ఆదాయం రూ.2 లక్షలు మించకూడదు.


నీట్, జేఈఈలకు లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణ

16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

రాజన్న సిరిసిల్ల : ఇంటర్ పూర్తి చేసిన వెనకబడిన తరగతుల (బీసీ) విద్యార్థులు జాతీయ స్థాయి వైద్య, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, ప్రముఖ ఇంజినీరింగ్ విద్యా సంస్థలు, మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించేలా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ చర్యలు చేపట్టింది. నీట్-యూజీ, జేఈఈ-2027కు గాను ఉచిత లాంగ్‌టర్మ్ రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తోంది. ఇందులో ఉత్తీర్ణులు, నీట్, జేఈఈ-2026లో మెరుగైన ప్రతిభ చూపిన విద్యార్థులకు అవకాశం ఉంటుంది.

ఎంపిక విధానం..

ప్రవేశాలు మెరిట్, నీట్ అర్హత ఆధారంగా కల్పిస్తారు. దరఖాస్తుల సంఖ్యను బట్టి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు దాటకూడదు.

రెండు కేంద్రాల్లో..

ఈ నెల 9న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ 16వ తేదీ వరకు కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా బాలికలకు నీట్‌లో 100, జేఈఈలో 40 సీట్లు, బాలురకు నీట్‌లో 50, జేఈఈలో 50 సీట్లు ఉన్నాయి. బాలికలకు నీట్ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) కళాశాల నాగిరెడ్డిపేటలో, బాలురకు నీట్ కళాశాల అబ్దుల్లాపూర్‌మెట్‌లో లాంగ్‌టర్మ్ శిక్షణ అందించనున్నారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా https://mjptbcadmissions.org వెబ్‌సైట్‌లో చేసుకోవాలి. నిపుణులైన అధ్యాపకుల చేత బోధన, ఉచిత వసతితో పాటు స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. ప్రత్యేక ప్రణాళికతో తరగతులు, మాక్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బీసీ గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. దీని ద్వారా వైద్య, ఇంజినీరింగ్ సంస్థల్లో ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుంది.

వి. సుస్మిత,
ఎం.జె.పి బీసీ గురుకులం,
జిల్లా కన్వీనర్,
రాజన్న సిరిసిల్ల.

**రాష్ట్రవ్యాప్తంగా పరిమిత సీట్లు**

ఈ ప్రత్యేక కోచింగ్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పరిమిత సంఖ్యలో మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయి. బాలికలకు నీట్‌లో 100, జేఈఈలో 40 సీట్లు, బాలురకు నీట్‌లో 50, జేఈఈలో 50 సీట్లు కేటాయించారు. బాలికల కోసం నాగిరెడ్డిపేటలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లో నీట్ శిక్షణ, బాలుర కోసం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ప్రత్యేక కేంద్రంలో కోచింగ్ నిర్వహించనున్నారు. విద్యార్థులకు పూర్తి స్థాయి రెసిడెన్షియల్ సదుపాయాలు కల్పించబడతాయి.

**ఉచితంగా అన్ని సౌకర్యాలు**

ఎంపికైన విద్యార్థులకు నిపుణులైన అధ్యాపకుల ద్వారా నాణ్యమైన బోధన, ఉచిత వసతి, భోజనం, అధ్యయన సామగ్రి, ప్రత్యేక అకడమిక్ ప్రణాళికతో తరగతులు, మాక్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు. విద్యార్థుల ప్రతిభను పెంపొందించేందుకు నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక శిక్షణా విధానాలు అమలు చేయనున్నారు.

**ఆగస్టు 16 వరకు దరఖాస్తులు**

ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆగస్టు 16వ తేదీ వరకు కొనసాగనుంది. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**

రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో బీసీ గురుకులాల సంస్థ అందిస్తున్న ఈ ఉచిత కోచింగ్ ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులు కూడా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయాలు సాధించే అవకాశం ఉందని జిల్లా కన్వీనర్ వి. సుస్మిత తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యా లక్ష్యాలను చేరుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

# వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య...

ఇల్లంతకుంట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 14



ఇల్లంతకుంట మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన మరిజ సంకీర్తన (27) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఫిర్యాది మరిజ యాదన్ రావు తెలిపిన వివరాల ప్రకారం... ఆయన కూతురు సంకీర్తన ఐదేళ్ల క్రితం బెజ్జంకి గ్రామానికి చెందిన సోమని రమేష్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. రమేష్ కరీంనగర్‌లో ఆటో నడుపుతుండేవాడు. కాగా, భర్త రమేష్, అత్త లచ్చవ్వ, మామ నరసయ్య, మరదలు శివ మరియు ప్రవీణ్ లు తమ కూతురును అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేశారు. వారి వేధింపులు భరించలేకనే సంకీర్తన ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. శవపంచనామాను ఇల్లంతకుంట తహసీల్దార్ సురేష్ నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణను సిరిసిల్ల డీఎస్పీ కే. నాగేంద్రచారి పర్యవేక్షిస్తున్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ.



రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 14

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శుక్రవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. వేడుకలకు సంబంధించిన వేదిక, పరేడ్ నిర్వహణ, వివిధ శాఖల శకటాల ప్రదర్శన, ప్రజాప్రతినిధులు, ప్రెస్, అధికారులు తదితరులు కూర్చునే ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి ఎస్పీ వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ గారి వెంట ఎస్బీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రవి, ఆర్ఐలు మధుకర్, సురేష్, తహసీల్దార్ మహేష్ తదితరులు ఉన్నారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**- సిరిసిల్లలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ: 30 ట్రాక్టర్లతో భాజపా శ్రేణుల దేశభక్తి ఉత్సాహం**

**- కులమతాలకు అతీతంగా ఏకం చేసే శక్తి జాతీయ జెండాదే: భాజపా నేతల పిలుపు**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 14

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ అత్యంత ఉత్సాహభరితంగా, ఘనంగా జరిగింది. ర్యాలీకి ముందు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ నుండి బతుకమ్మ ఘాట్ వరకు చేతిలో జాతీయ జెండాలు పట్టుకుని, దేశభక్తి నినాదాలతో ర్యాలీ సాగింది. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు జాతీయ జెండాలతో అలంకరించిన 30 ట్రాక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక ర్యాలీ ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, 140 కోట్ల మంది భారతీయులను కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఒకే తాటిపైకి తెచ్చే శక్తి మన త్రివర్ణ పతాకానికి ఉందన్నారు. దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా ఒక గొప్ప ప్రజా ఉద్యమమని, జాతీయ జెండా భారతదేశ గౌరవానికి, స్వాభిమానానికి ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్,



కుమ్మరి శంకర్, కౌడిపల్లి గోపాల్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్లు ఆడెపు రవీందర్, దశరథం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కరెడ్ల మధుకర్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాల పెంపు

**- ఉపసర్పంచ్ నరేష్ చేతుల మీదుగా ఇంకుడు గుంత పనుల ప్రారంభం**



వీర్నపల్లి మండలం ఆగస్టు 14 /(ప్రజా దివాస్)

వీర్నపల్లి మండల కేంద్రంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఉపసర్పంచ్ నరేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి బోరు పక్కన ఇంకుడు గుంతను నిర్మించాలని ప్రజలకు సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని, తద్వారా నీటి కొరతను కొంత మేర తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై నీటి వనరుల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తిరుపతి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ శోభ.. వేములవాడ మహాలక్ష్మి ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు

**- శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారి అర్చనలు**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 14

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోజూ ఉదయం, సాయంత్రం శ్రీ రాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి చతుష్షష్టి ఉపచారములతో విశేష పూజలు నిర్వహిస్తుండగా, సాయంత్రం 4:00 గంటల నుంచి శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి షోడశోపచార పూజలు, అర్చనలు, ప్రత్యేక సేవలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భక్తులు "యా దేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః" అనే దుర్గా సప్తశతి శ్లోకాన్ని పఠిస్తూ అమ్మవారిని ఆరాధించారు. పౌర్ణమి రోజు శ్రవణ నక్షత్ర యుతంగా ఉండే ఈ మాసాన్ని





శ్రావణమాసంగా పిలుస్తారు. శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రంతో కూడిన ఈ మాసంలో విష్ణుమూర్తి అనుగ్రహం విశేషంగా లభిస్తుందని, అందుకే కార్తీక, మాఘమాసాలతో సమానంగా దీనికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని పురాణాలు పేర్కొంటున్నాయి. శ్రీమహావిష్ణువు సహచరిణి అయిన శ్రీ మహాలక్ష్మి దేవిని ఈ మాసంలో పూజించడం ద్వారా ఐశ్వర్యం, ఆరోగ్యం, సుఖశాంతులు, కుటుంబ అభివృద్ధి, ధనధాన్య సమృద్ధి కలుగుతాయని ఆగమ శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు ఓడి బియ్యం సమర్పించి కుటుంబ సంక్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం సాయంత్రం సూర్యాస్తమయం అనంతరం నిర్వహించే ఛాయానక్త పూజకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ సమయంలో మహాలక్ష్మి అమ్మవారిని అర్చించిన వారికి దారిద్ర్య నివారణ, ఆర్థికాభివృద్ధి, సంతాన సౌభాగ్యం, ఉత్తర పౌత్రాభివృద్ధి, కుటుంబంలో సుఖశాంతులు చేకూరుతాయని వేద పండితులు తెలిపారు. ఈ ప్రత్యేక పూజల్లో దేవస్థానం ప్రోటోకాల్ పర్యవేక్షకులు పేరుకే శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ కుమార్, ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి భారీగా చేరికలు: కండువాలు కప్పి ఆహ్వానించిన ఇన్చార్జ్ మజీద్

- 2029లో కల్వకుంట్ల కవితక్కను సీఎం చేయడమే లక్ష్యం: మజీద్
- ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాలకు చెందిన కార్యకర్తలు పార్టీలో చేరిక



రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 14

సిరిసిల్ల నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాలలోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 50 మందికి పైగా మహిళలు, యువకులు, నిరుద్యోగులు శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పార్టీలో చేరారు. వారికి సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ మజీద్ మాట్లాడుతూ... తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితక్క ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ఉద్యమకారులు, సింగరేణి కార్మికులు, ఆటో కార్మికులు, నిరుద్యోగుల పక్షాన నిలవడమే కాకుండా, నేరెళ్ల బాధితులకు న్యాయం చేకూరేలా ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. కవితక్క ప్రవేశపెట్టిన 'పాంచజన్య' సూత్రాలు, ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం వంటి ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుంట్ల కవితక్కను ముఖ్యమంత్రిని చేయడమే ప్రతి ఒక్కరి ధ్యేయంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కవితక్క ఆశయాలను, పాంచజన్య పథకాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి వచ్చి సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మార్వాడి దేవరాజు, సయ్యద్ జావిద్, కదిరే రేణుక, లాస్య, అశోక్, బైరి రాజేష్, కొర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎరువుల కొరత లేదు – కలెక్టర్ గరిమ అగ్రవాల్

- పంటల సాగుకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఎరువుల సరఫరాపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 14

జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఎరువుల సరఫరా, నిల్వలు, పంపిణీ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సహకార, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమై జిల్లాలో ఎరువుల లభ్యతపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగు అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని అన్ని ఎరువుల దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వ్యాపారవేత్తలు ఇంక్యుబేటర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- వ్యాపారాల అభివృద్ధికి సాంకేతిక, మార్కెటింగ్, ఆర్థిక సహకారం
- డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి

ప్రజాదివాస్

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించి, వారు నిర్వహిస్తున్న వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, మార్గదర్శకత్వం, మార్కెటింగ్, ఆర్థిక అవకాశాలను అందించడమే ఇంక్యుబేటర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి తెలిపారు. డే. ఎన్. ఆర్. ఎల్. ఎమ్-- ఎస్ ఇ ఆర్ పి ఆధ్వర్యంలో మహిళల నేతృత్వంలో కొనసాగుతున్న వ్యాపారాలను మరింత బలోపేతం చేయడం, అభివృద్ధి సామర్థ్యం ఉన్న వ్యాపారాలను గుర్తించి వాటికి అవసరమైన సహకారం అందించడం కోసం శుక్రవారం జిల్లా స్థాయిలో ఇంక్యుబేటర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలను కేవలం చిన్న స్థాయిలో కొనసాగించకుండా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వ్యాపార విస్తరణ, నాణ్యత పెంపు, సాంకేతికత వినియోగం, మార్కెటింగ్, ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెట్ అనుసంధానం, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మహిళా వ్యాపారాలకు ఇంక్యుబేటర్ ద్వారా తోడ్పాటు ఇంక్యుబేటర్ కార్యక్రమం ద్వారా అభివృద్ధి సామర్థ్యం ఉన్న మహిళా ఆధ్వర్యంలోని వ్యాపారాలను గుర్తించి, వాటికి అవసరమైన మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం, ఆర్థిక సదుపాయాలకు అనుసంధానం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలు తమ అనుభవాలను మరింత మెరుగుపరుచుకుని, వ్యాపార నిర్వహణలో ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు నాణ్యత, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ అంశాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విస్తృత మార్కెట్లను చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఛాలెంజ్ ఫండ్ ద్వారా అవకాశాలు ఇంక్యుబేటర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఛాలెంజ్ ఫండ్ ప్రచారం గురించి మహిళా వ్యాపారవేత్తలకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన మహిళా వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న మహిళలను గుర్తించడం నుంచి దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన సమాచారం అందించడం, తదుపరి దశల్లో మార్గదర్శకత్వం అందించడం వరకు క్షేత్రస్థాయి సిబ్బంది చురుకైన పాత్ర పోషించాలని అధికారులు సూచించారు. బ్యాంకులతో సమన్వయం మహిళా వ్యాపారవేత్తలకు అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు బ్యాంకులు, సంబంధిత ఆర్థిక సంస్థలతో సమన్వయం చేయాలని సూచించారు. వ్యాపార విస్తరణకు అవసరమైన ఆర్థిక వనరులను సక్రమంగా వినియోగించుకునేలా మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంక్యుబేటర్ కార్యక్రమం ద్వారా మహిళా వ్యాపారవేత్తలకు సాంకేతిక పరిజ్ఞానం, మెంటరింగ్, ఆర్థిక సదుపాయాలు, మార్కెట్ అవకాశాలను అనుసంధానం చేయడం ద్వారా వారి వ్యాపారాలను మరింత స్థిరమైన, లాభదాయకమైన వ్యాపారాలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మండల స్థాయి సిబ్బంది కీలక పాత్ర జిల్లాలోని అన్ని మండలాల్లో అర్హత కలిగిన మహిళా వ్యాపారవేత్తలను గుర్తించి, కార్యక్రమం ద్వారా లభించే అవకాశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా ఏ.పి.ఏం. లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (సి.సి.లు) గ్రామీణ ప్రాంతాల్లో మహిళా వ్యాపారవేత్తలను గుర్తించి, వారి వ్యాపారాల స్వభావం, అభివృద్ధి అవకాశాలు, అవసరాలను తెలుసుకుని తగిన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ప్రస్తుతం విజయవంతంగా కొనసాగుతున్న మహిళా వ్యాపారాలను గుర్తించి, వాటిని ఇతర మహిళలకు ఆదర్శ వ్యాపారాలుగా పరిచయం చేయడం ద్వారా మరింత మంది మహిళలు వ్యాపార రంగంలోకి వచ్చేలా ప్రోత్సహించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులుఈ జిల్లా స్థాయి కార్యక్రమంలో (డి. ఆర్. డి. ఓ) దామోదర్



రెడ్డి, ఏ. డి. ఆర్. డి. ఓ. విజయలక్ష్మి, డిపిఎం సాయిలు, బిట్స్ పిలాని సంస్థ మేనేజర్ వినోద్ కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ శివ కుమార్, ఏ. పి. యం. రాజేందర్ పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని మండలాల ఏ. పి. ఏం. లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (సి. సి. లు), మహిళా వ్యాపారవేత్తలు, ఎస్. ఇ. ఆర్. పి. సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిట్స్ పిల్లని ప్రతినిధులు ఇంక్యుబేటర్ కార్యక్రమం ద్వారా అందించనున్న మార్గదర్శకత్వం, వ్యాపార అభివృద్ధి అవకాశాలు, మహిళా వ్యాపారవేత్తలకు అందుబాటులో ఉండే సహకారంపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారతకు మరో ముందడుగు మహిళలు స్వయం సహాయక సంఘాల పరిధిలో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, వాటిని స్థిరమైన వ్యాపారాలుగా అభివృద్ధి చేసుకోవడం ద్వారా కుటుంబ ఆదాయం పెంచడంతో పాటు స్థానికంగా ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని అధికారులు ఆకాంక్షించారు. మహిళా వ్యాపారవేత్తల సామర్థ్యాన్ని గుర్తించి, వారికి సరైన సమయంలో సరైన మార్గదర్శకత్వం, అవసరమైన సహకారం అందించినట్లయితే గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని విజయవంతమైన మహిళా వ్యాపారాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. జిల్లాలో అర్హత కలిగిన ప్రతి మహిళా వ్యాపారవేత్తకు ఇంక్యుబేటర్ కార్యక్రమం ద్వారా లభించే అవకాశాలు చేరేలా ాజు-ా క్షేత్రస్థాయి సిబ్బంది, బ్యాంకులు, ఇంక్యుబేటర్ భాగస్వామ్య సంస్థలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. మహిళా వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాలను విస్తరించి, స్వయం ఉపాధితో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు.

# వేములవాడలో ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరాలి: రాపెల్లి శ్రీధర్

- జిల్లా కేంద్రంలో భారీ 'తిరంగా' ర్యాలీ వేములవాడ నుండి పెద్ద ఎత్తున తరలివెళ్లిన బిజెపి శ్రేణులు
- బిజెపి 'తిరంగా' కార్యక్రమం పాఠశాల విద్యార్థులకు జాతీయ జెండాల పంపిణీ











వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 14

వేములవాడ బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ గౌతమ్ మోడల్ స్కూల్‌లోని ప్రతి విద్యార్థికి జాతీయ జెండాలను అందజేసి, జాతీయ జెండా గౌరవాన్ని మరియు దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రతాప రామకృష్ణ గారు మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు నేటి యువత చేతుల్లోనే ఉందని అన్నారు. కుల, మత, జాతి భేదాలు లేకుండా భారతీయ పౌరులందరూ గర్వంగా ఎగరవేసేది మన జాతీయ జెండా మాత్రమేనని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా మరో సంవత్సరం పాటు తెలంగాణకు విమోచనం లభించకపోవడం బాధాకరమని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పాఠశాల కార్యక్రమానికి ముందు, జిల్లా కేంద్రంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీకి వేములవాడ నుండి బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ కుమ్మరి శంకర్, కొండ్లెపు ముత్యం, వంగల శీను, మైలారం శ్రీను, నాయకులు సిరికొండ శ్రీనివాస్, రేగుల సంతోష్ బాబు, రేగుల శ్రీకాంత్, మామిళ్ళ లక్ష్మీరాజ్యం, పిన్నింటి హనుమాన్లు, బిల్ల కృష్ణారి, గుడిసె మనోజ్, కటకం శ్రీనివాస్, వివేక్ రెడ్డి, డాక్టర్ వెంకన్న, నామాల శేఖర్, పల్లెపు లక్ష్మణ్, జగన్నాథం శీను, సాయికృష్ణ, హరీష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీలో అవినీతి తిమింగలాలు రోజుకో రీతిన పంజా








ప్రజాదివాస్
మున్సిపాలిటీ ఏర్పడి కొద్దిరోజులు కూడా గడవకముందే వరుస కుంభకోణాలు వెలుగుచూడటం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. మొన్నటికి మొన్న డీజిల్ కుంభకోణంపై చర్చ జరుగుతుండగానే, తాజాగా ప్రభుత్వానికి చెందిన పాత ఇనుప సామాగ్రిని గుట్టుచప్పుడు కాకుండా స్క్రాప్ దుకాణానికి తరలించి సొమ్ము చేసుకున్నారనే బాగోతం బట్టబయలైంది. మినీ స్టేడియం సాక్షిగా ఇనుప దందా! గతంలో ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉండి, ప్రస్తుతం మినీ స్టేడియం నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో ఐడీసీ బోరు వాటర్ ట్యాంకులు, భారీ ఇనుప పైపులు తదితర సామాగ్రి ఉండేది. ఈ స్థల నిర్వహణ బాధ్యతలు చూస్తున్న మున్సిపాలిటీలోని కొందరు సిబ్బంది, బయటి ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇరిగేషన్ శాఖకు గానీ, ఉన్నతాధికారులకు గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే, పనుల పేరుతో ఆ భారీ ఇనుప లోహాలను తొలగించి స్థానిక పాత ఇనుప దుకాణానికి తరలించారు. సుమారు 60 వేలకు పైగా విలువ చేసే ఈ స్క్రాప్‌ను అమ్ముకొని జేబులు నింపుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మా ఆధ్వర్యంలోనే పంపాం : కమిషనర్ వింత సమర్థన

ఈ వ్యవహారంపై మీడియాలో కథనాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు రహస్య విచారణకు దిగారు. అయితే దీనిపై మున్సిపల్ కమిషనర్ వివరణ ఇస్తూ స్క్రాప్ దొంగతనం జరగలేదని, అదంతా తమ కంట్రోల్‌లోనే ఉందని, తమ ఆధ్వర్యంలోనే పాత ఇనుప దుకాణానికి తరలించామని, త్వరలోనే వేలం వేస్తామని పేర్కొనడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రజలు, విలేకరులు సంధిస్తున్న ప్రశ్నలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం పాట నిర్వహించకుండా, ప్రభుత్వ ఆస్తిని ప్రైవేటు స్క్రాప్ కొట్టుకు ఎలా తరలిస్తారు తరలించిన ఇనుము బరువు ఎన్ని కేజీలు దాని విలువ ఎంత అనే లెక్కలు రికార్డుల్లో ఎందుకు లేవు వేలం నిర్వహించే వరకు మున్సిపల్ కార్యాలయం లేదా ప్రభుత్వ స్థలంలో భద్రపరచాల్సిన వస్తువులు ప్రైవేటు కొట్లో ఎందుకు ప్రత్యక్షమయ్యాయి ఈ ప్రశ్నలకు అధికారుల వద్ద పొంతనలేని సమాధానాలు తప్ప స్పష్టత లేకపోవడం అనుమానాలకు మరింత ఆజ్యం పోస్తోంది. ఆదిలోనే హంసపాదు : ఉన్నతాధికారులు స్పందించేనా మున్సిపాలిటీగా రూపాంతరం చెంది అభివృద్ధి పథంలో పయనించాల్సిన పట్టణం, అధికారుల నిర్లక్ష్యం మరియు కిందిస్థాయి సిబ్బంది కమిషన్ల కక్కుర్తితో అవినీతి అడ్డాగా మారుతోందని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీజిల్ స్కాం, ఇప్పుడు స్క్రాప్ స్కాం ఇలా రోజుకో కుంభకోణం బయటపడుతుంటే పాలన గాడితప్పుతోందని మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, మున్సిపల్ ఉన్నత స్థాయి విభాగం తక్షణమే స్పందించి, అశ్వారావుపేట మున్సిపాలిటీలో జరుగుతున్న వరుస అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అడవిపంది ఢీకొని వ్యక్తికి గాయాలు..

ప్రజాదివాస్



కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం లోని దేవాయపల్లి గ్రామానికి చెందిన రోడ్డు వద్ద బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని అడవిపంది అకస్మాత్తుగా ఢీకొనడంతో గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. దేవాయపల్లి గ్రామానికి చెందిన రాములు (55), తండ్రి బాలయ్య, ఎస్సీ మాల కులానికి చెందిన ఆయన (ఎస్.పి.ఆర్.) స్కూల్లో అటెండర్‌గా పనిచేస్తున్నారు. రాములు బైక్‌పై లింగాపూర్ రోడ్డు మీదుగా వెళ్తుండగా రహదారిపైకి వచ్చిన అడవిపంది ఒక్కసారిగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాములు బైక్‌పై నుంచి అదుపుతప్పి పడిపోవడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే స్పందించి ఆయనను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రాములుకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రస్తుతం కండిషన్ నార్మల్‌గా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో లింగాపూర్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో అడవిపందుల సంచారం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై తరచూ అడవిపందులు సంచరిస్తుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

# దేవాలయ భూముల పరిరక్షణకు అందరూ పాటుపడాలి

**– దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ నందనం కవిత**

ప్రజాదివాస్



ఆత్మకూరు దేవాలయాల భూముల పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ నందనం కవిత సూచించారు. శుక్రవారం ఆత్మకూరు లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న భూములపై దామెర ఆత్మకూరు మండలాల అర్చకులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయాలకు ఉన్న భూములు తదితర వాటి గురించి సమగ్రంగా చర్చించారు ఆలయాల భూముల ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయాలకు చెందిన భూములు అర్చకుల ఆధీనంలోనే ఉండాలని అన్నారు ఆక్రమణకు గురైన భూములను సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆలయ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు చేసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి కొల్లుపాక వీర మల్లయ్య వర్షనూరు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

**–టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టాస్క్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బాలు**

ప్రజాదివాస్
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టాస్క్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బాలు డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి కాంట్రాక్టర్లపై ఉన్న ప్రేమ పేద విద్యార్థులపై లేదని విమర్శించారు. మూడు సంవత్సరాలకు సంబంధించిన ఫీజు బకాయిలు పెండింగ్‌లో



ఉండటంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధికారంలోకి వస్తే ఫీజు బకాయిలన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా బకాయిలను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వానికి సంబంధించిన ఫీజు బకాయిలను తాను ఎందుకు చెల్లించాలని ప్రశ్నిస్తున్న ముఖ్యమంత్రి, అదే సమయంలో గత ప్రభుత్వాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ఎంతమంది కాంట్రాక్టర్లకు చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ఫీజు బకాయిల విడుదల కోసం ఉద్యమం చేపడతామని డాక్టర్ బాలు హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ విద్యార్థులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

# పెద్దాపురం, ఆత్మకూర్ గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన



ప్రజాదివాస్
ఆత్మకూర్ మండలంలోని పెద్దాపురం మరియు ఆత్మకూర్ గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వర్షపాతం తక్కువగా ఉండటం, భూగర్భ జలాలు తగ్గిపోతుండటంతో అధిక నీటి అవసరం ఉన్న వరి పంట సాగును రైతులు తగ్గించి, దానికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగు చేయగల కంది, పెసర,మినుములు, కొర్ర, జొన్న, సజ్జలు, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వనరులను సంరక్షించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి,పొనుగోటి యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవళిక, నరేష్ మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఆదిదేవుడు వినాయకుని ఆశీస్సులే సకలమానవాళికి శ్రీరామ రక్ష

**– డి.సి.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల.**

ప్రజాదివాస్
గడియకట్ట యూత్ (జిడికె) ఆధ్వర్యంలో జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాల మండపానికి కర్రపూజ. కర్రపూజలో పాల్గొన్న కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి దంపతులు. ఆదిదేవుడు వినాయకుని ఆశీస్సులే సకలమానవాళికి శ్రీరామ రక్ష, అని డి.సి.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సెప్టెంబర్ నెలలో జరిగే గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పాత పాల్వంచ గడియకట్ట లో గడియకట్ట(జిడికె) యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం కర్రపూజ నిర్వహించారు. ప్రముఖ పూజారి కందాళ ఆనంద కుమారా చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో కొత్వాల తో పాటు పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని, నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ నిత్యం వినాయకుణ్ణి ప్రథమంగా పూజించాలని, తద్వారా విఘ్నాలు తొలగుతాయన్నారు. పూజల ద్వారా వినాయకుని ఆశీస్సులు అందరికీ లభిస్తాయని కొత్వాలఅన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, కె.టి.పి.ఎస్ ఎ.డి.ఇ. చంద్రరేఖ, ఉత్సవాల నిర్వాహకులు బర్ల అన్వేష్, బట్టు సాగర్, బండ్ల ప్రశాంత్, మండిగ రమేష్, బూతం జగన్, కొండపెల్లి నాగరాజు, పిల్లల బాలాజీ, బండ్ల




నీరజ్, వెంకీ, లాలు, నందు, గణేష్, వినయ్, మణి, సాయి, బన్ను, పవన్, వసంత్, కిరణ్, అభిలాష్, సురేష్, నరేష్, శ్రీకాంత్, గ్రామ పెద్దలు, బర్ల పాపారావు ముత్యాల కోటేశ్వరరావు, మసనం శరత్, కిరణ్, మల్లేష్, కిలారి సుజాత, బూసి శ్రీను,బొందిల బాలు , తదితరులు పాల్గొన్నారు.

# గెలిచేది... వీరుడా... రాక్షసుడా?





బాలీవుడ్ కథానాయకులు అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'హైవాన్'. ప్రియదర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె.నారాయణ, శైలజ దేశాయ్ ఫెన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బోమన్ ఇరానీ, సయామీ ఖేర్, శ్రియా పిల్గాంకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో “ఒకవైపు సత్యం, మరోవైపు కుట్ర. మధ్యలో ఓ బాధితుడు. గెలుపు ఎవరిది? వీరుడా లేక రాక్షసుడా?” అనే క్యాప్షన్‌ను జోడించింది. సైఫ్ అలీ ఖాన్‌ను ఒక అంధుడిగా పరిచయం చేస్తూ ప్రారంభమైన టీజర్‌లో చివరగా అక్షయ్ కుమార్ కనిపించిన తీరు ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగే ఉత్కంఠభరితమైన ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుందని టీజర్ స్పష్టం చేస్తుంది.

# దుల్కర్ సల్మాన్ కొత్త సినిమా వాయిదా.. కారణమిదే!



దుల్కర్ సల్మాన్ ప్రధానపాత్రలో నహాస్ హిదాయత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఐ యామ్ గేమ్'. దుల్కర్ స్వయంగా నిర్మిస్తోన్న ఈ సినిమా వాయిదా పడనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆ వార్తలపై ఆయన స్పష్టతనిచ్చారు. 'ఐ యామ్ గేమ్' కొత్త విడుదల తేదీని ప్రకటించారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 20న విడుదల చేస్తున్నట్లు టీమ్ ప్రకటించింది. అయితే కొన్ని పనులు ఇంకా పూర్తికాకపోవడంతో పాటు ఒకేసారి తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలనే ఉద్దేశంతో విడుదలను వాయిదా వేస్తున్నట్లు దుల్కర్ పోస్ట్ పెట్టారు. సెప్టెంబర్ 3న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు పేర్కొన్నారు. భారీ స్థాయిలో దీని విడుదల ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు.ఇందులో దుల్కర్‌కు జోడీగా కయాదు లోహర్ నటిస్తున్నారు. తమిళ దర్శకుడు మిస్కిన్ కీలకపాత్రలో కనిపించనున్నారు. దక్షణ భారతదేశంలోని 100కి పైగా ప్రసిద్ధ ప్రదేశాలలో ఈ సినిమా షూటింగ్ చేసినట్లు సమాచారం. ఇటీవల విడుదలైన ట్రైలర్‌పై ఎన్టీఆర్ ప్రశంసలు కురిపించారు. అద్భుతంగా ఉందని పోస్ట్ పెట్టారు.




# ఆసుపత్రి నుంచి ఎన్టీఆర్ డిశ్చార్జ్..

కిమ్స్ ఆసుపత్రి నుంచి నటుడు ఎన్టీఆర్ డిశ్చార్జ్ అయ్యారు. ఆయన కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడంతో వైద్యులు ఆయనను ఇంటికి పంపించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య బృందం వెల్లడించింది. కాగా.. సర్జరీ అనంతరం వైద్యులతో ఆయన దిగిన ఫొటో ప్రస్తుతం బయటకు వచ్చింది. దీని షేర్ చేస్తోన్న అభిమానులు ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలంటూ పోస్టులు పెడుతున్నారు.జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా.. ఇటీవల ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. దీనిపై వైద్యులను సంప్రదించగా శస్త్ర చికిత్స అవసరమని వారు సూచించారు. ఇందుకోసం మంగళవారం ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చేరగా.. వైద్యులు ఆర్థ్రోస్కోపిక్ సర్జరీ చేశారు. శస్త్రచికిత్స నుంచి కోలుకున్న తర్వాత ఎన్టీఆర్‌కు కొన్ని రోజులపాటు ఫిజియోథెరపీ అవసరమని డాక్టర్లు సూచించారు. పూర్తిగా కోలుకోవడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పట్టొచ్చని వెల్లడించారు. తాను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

# శివరాజ్ కుమార్ చిత్రంలో మాధురీ దీక్షిత్?

ఇటీవలే ఓటీటీ వేదికగా 'మా బెహెన్' చిత్రంలో కథానాయిక త్రిప్తి దిమ్రి, ధర్ల దుర్గలతో కలసి సందడి చేశారు బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్. ఇప్పుడామె కన్నడ చిత్రసీమలో నటుడు శివరాజ్‌కుమార్ చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఆయన ప్రధాన పాత్రలో 'ఏ ఫర్ ఆనంద్' అనే సినిమా రూపొందనుంది. గీతా పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న ఈ చిత్రానికి శ్రీని దర్శకత్వం వహించనున్నారు. ఈ మధ్యే శివరాజ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాలో ఆనంద్ అనే ఉపాధ్యాయుడిగా కనిపిస్తారని, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభమవుతుందని ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలో కీలకపాత్ర కోసం దర్శకుడు.. మాధురీ దీక్షిత్‌ను సంప్రదించారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కి గనుక ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయితే దక్షిణాది చిత్రసీమలో మాధురి తొలి చిత్రమిదే అవుతుంది.





# ఆ యూట్యూబర్లను శిక్షించండి.. విజయ్‌కి విశాల్ రిక్వెస్ట్

గత కొన్ని రోజులుగా తమిళనాట జరుగుతోన్న రాజకీయ పరిణామాలపై నటుడు విశాల్ స్పందిచారు. డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ గురించి మాట్లాడిన ఆయన.. ఎంతోమంది యూట్యూబర్లు నటీనటుల గురించి నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై తమిళనాడు సీఎం విజయ్‌కు విశాల్ ఓ విజ్ఞప్తి చేశారు.నటి త్రిషపై డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు, ఆయన అరెస్ట్‌పై విశాల్ తాజాగా జరిగిన ఓ ఈవెంట్‌లో మాట్లాడారు. “నా స్నేహితుడు ఉదయనిధి ఏదో అన్నాడు.. అరెస్ట్ అయ్యాడు. ఇండస్ట్రీలో ఉన్న సీనియర్ నటీనటుల గురించి ఆ విధంగా మాట్లాడేవారు చాలా మంది ఉన్నారు. మరి ఆ యూట్యూబర్ల సంగతేంటి?.. మొహం కనిపించకుండా అలా మాట్లాడేవాళ్లను.. తెర ముందుకు వచ్చి ఇదే విషయం చెప్పమని అడగండి. వాళు చెప్పరు. ఎందుకంటే దానికి వాళ్లకు డబ్బులు రావు. విజయ్‌కు నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను. ఇండస్ట్రీకి చెందిన వారి గురించి యూట్యూబ్‌లో చాలా మంది నీచంగా మాట్లాడుతున్నారు. వాళ్లందరికి కూడా శిక్షపడేలా చేయాలని కోరుతున్నా” అని విశాల్ తెలిపారు.మురికి కాలువల నుంచే బొద్దింకలు వస్తాయి.. నా వ్యాఖ్యల్లో తప్పేముంది: కంగనా రనౌత్ ఇక ఉదయనిధి గురించి విశాల్ మాట్లాడుతూ.. “మా స్నేహం ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటుంది. ఒకవేళ నేను రాజకీయాల్లోకి వచ్చినా.. మా ఇద్దరికీ మధ్య ఎలాంటి విభేదాలు రావు. తీవ్రమైన దూషణలు ఉండవు. ఈ విషయాన్ని నేను ఈరోజు బహిరంగంగా అంగీకరిస్తున్నాను. గతంలో ఒక సినిమా విషయంలో నేను అనుభవించిన బాధ వల్ల అతడి నిర్మాణ సంస్థ గురించి కోపంగా మాట్లాడాను. కానీ, అతడు చాలా మంచి వ్యక్తి” అని విశాల్ అన్నారు.

# సినిమాలు చూసేందుకే భీమవరంలో ఉన్నా: రవితేజ



“నాకో బలహీనత ఉంది. ఏ ఆడకూతురులోనైనా నా కూతురుని చూసుకునే అరుదైన బలహీనత” అంటున్నారు రవితేజ. ఇదంతా 'ఇరుముడి' చిత్రం కోసమే. శివ నిర్వాణ దర్శకత్వంలో రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమే 'ఇరుముడి'. ప్రియ భవానీ శంకర్ కథానాయిక. బేబి నక్షత్ర, సాయికుమార్ ముఖ్య పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం భీమవరంలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి రఘు రామకృష్ణంరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి కథానాయకుడు రవితేజ మాట్లాడుతూ “భీమవరంతో నాకు మంచి అనుబంధం ఉంది. నా జీవితంలో దాదాపు ఎనిమిది నెలలపాటు కేవలం సినిమాలు చూసేందుకే భీమవరంలో ఉన్నా. మా తాతయ్య, నానమ్మ డీఎన్ఆర్ కళాశాల దగ్గర ఉండేవారు. భీమవరానికి మంచి వైబ్ ఉంటుంది. వచ్చే సంక్రాంతికి కలుద్దాం. 'ఇరుముడి' ట్రైలర్ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది” అన్నారు. 'ఇరుముడి' సినిమా మాత్రమే కాదు, ఇదొక భావోద్వేగం అన్నారు దర్శకుడు. రఘు రామకృష్ణంరాజు మాట్లాడుతూ “రవితేజ స్టార్ అవ్వాలనే సంకల్పంతో తన స్వశక్తితో ఎదిగిన రియల్ హీరో. తనని చూస్తే చాలా గర్వంగా అనిపిస్తుంది. కృష్ణంరాజు, ప్రభాస్, చిరంజీవి, పవన్‌కల్యాణ్, అల్లు అర్జున్... ఇలా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఎంతోమంది హీరోలుగా రాణించారు” అన్నారు. వేదికపై రవితేజ, బేబి నక్షత్ర నృత్యాలు చేసి ప్రేక్షకుల్ని అలరించారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.సినిమాలు చూసేందుకే భీమవరంలో ఉన్నా: రవితేజ “నాకో బలహీనత ఉంది. ఏ ఆడకూతురులోనైనా నా కూతురుని చూసుకునే అరుదైన బలహీనత” అంటున్నారు రవితేజ. ఇదంతా 'ఇరుముడి' చిత్రం కోసమే. శివ నిర్వాణ దర్శకత్వంలో రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమే 'ఇరుముడి'. ప్రియ భవానీ శంకర్ కథానాయిక. బేబి నక్షత్ర, సాయికుమార్ ముఖ్య పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం భీమవరంలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి రఘు రామకృష్ణంరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి కథానాయకుడు రవితేజ మాట్లాడుతూ “భీమవరంతో నాకు మంచి అనుబంధం ఉంది. నా జీవితంలో దాదాపు ఎనిమిది నెలలపాటు కేవలం సినిమాలు చూసేందుకే భీమవరంలో ఉన్నా. మా తాతయ్య, నానమ్మ డీఎన్ఆర్ కళాశాల దగ్గర ఉండేవారు. భీమవరానికి మంచి వైబ్ ఉంటుంది. వచ్చే సంక్రాంతికి కలుద్దాం. 'ఇరుముడి' ట్రైలర్ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది” అన్నారు. 'ఇరుముడి' సినిమా మాత్రమే కాదు, ఇదొక భావోద్వేగం అన్నారు దర్శకుడు. రఘు రామకృష్ణంరాజు మాట్లాడుతూ “రవితేజ స్టార్ అవ్వాలనే సంకల్పంతో తన స్వశక్తితో ఎదిగిన రియల్ హీరో. తనని చూస్తే చాలా గర్వంగా అనిపిస్తుంది. కృష్ణంరాజు, ప్రభాస్, చిరంజీవి, పవన్‌కల్యాణ్, అల్లు అర్జున్... ఇలా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఎంతోమంది హీరోలుగా రాణించారు” అన్నారు. వేదికపై రవితేజ, బేబి నక్షత్ర నృత్యాలు చేసి ప్రేక్షకుల్ని అలరించారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.